


“నేనివాళ మీ దగ్గరకు మందు కోసం రాలేదు!” అనంది సరోజ. మరెందుకోసం వచ్చేవన్నట్లు

ఆమె ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసాడు డాక్టర్ మూర్తి.

"నాకు పెళ్ళి నిశ్చయమైందని చెప్పడానికి వచ్చాను" అనంది సరోజ.

జరగడానికి బొత్తిగా అవకాశం లేని సంఘటనేదో జరుగుతున్నట్లుగా ఆశ్చర్యపోతూ, "నీకు పెళ్ళా?" అనడిగాడు మూర్తి.

"అవును. నాకే పెళ్ళి! వచ్చే నెల పదో తేదీని. ఇంకా ఇన్విటేషన్ కార్డ్స్ అచ్చొత్తించలేదు. అచ్చొత్తించిన వెంటనే స్వయంగా వచ్చి మిమ్మల్ని ఆహ్వానిస్తాను. నా పెళ్ళి పనులు చాలావరకూ నేనే చేసుకోవాల్సి ఉంటుందన్న సంగతి మీకు తెల్సుగా!....నాకు బోలెడు పనులున్నాయి. వెళ్తాస్తాను" అని అంటూ వెళ్ళిపోయింది సరోజ.

వెళ్ళిపోతున్న సరోజకేసి సాలోచనగా చూస్తూ, 'దీన్ని పెళ్ళిచేసుకోబోతున్న దౌర్భాగ్యుడెవరు చెప్మా?' అని ఆలోచించసాగాడు డాక్టర్ మూర్తి! 'పాపం! వాడెవడోగాని దీని వలలో మా బాగా పడ్డాడు. తనకు దీని సంగతి బాగా తెలుసు. కాని వాడికి దీని సంగతి బహుశా తెలిసివుండదు. తెలుసున్నట్లయితే దీన్ని పెళ్ళి చేసుకొనేటందుకు ఇష్టపడి వుండేవాడు కాడ'ని అనుకున్నాడు డాక్టర్‌మూర్తి.

'గర్భస్రావం చేయించుకొనేటందుకు ఈమె తన దగ్గరకు వచ్చింది మొదట. ఆ ఊళ్ళో లేడీ డాక్టర్ లేకపోవడంవలన, మరో వూళ్ళోగల లేడీ డాక్టర్ దగ్గరకెళ్ళడాని కవసరమయ్యే ఆర్థిక స్తోమత లేకపోవడంవలన తన దగ్గరకు గర్భస్రావం చేయించుకొనేటందుకు వచ్చిందామె.

'అంటే వేరే గత్యంతరంలేక, తనే ఆ ప్రాంతంలో ఓ క్వాలిఫైడ్ డాక్టరయినందువలన తన దగ్గరకొచ్చిందామె- గర్భస్రావం చేయించుకొనేటందుకు. గుప్‌చిప్‌గా జరిగిపోవాలని, ఎవ్వరికీ ఏ విధమైన అనుమానం కలుగకుండా చెయ్యాలని బ్రతిమాలింది తనను. 200 రూ॥ ఫీజు అడిగాడు తాను.

'ఆమె తన దారిద్ర్యాన్ని కన్నీళ్ళ రూపంలో తన పాదాలమీద ఒలకబోసింది. సరే! ఎంతో కొంత ఇచ్చుకోమన్నాడు తాను. ఆమె నిస్సహాయంగా తనవేపు చూస్తూ ఓ చిన్నపిల్లలా ఏడుస్తూంటే జాలేసింది తనకు!

'ఆమె గర్భం దాల్చడానికి కారకుడెవడో తెలుసుకోవాలనే కుతూహలంతో తనెంతగా అడిగినప్ప

టికీ వివరాలు చెప్పలేదామె. కాని వాడొక బస్సు ప్రమాదంలో చని పోయినట్లు మాత్రం చెప్పింది. తనకామె మాటమీద నమ్మకం ఏర్పడలేదు. ఎవడని చెప్పగలదు? ఎందరో!! ఇదీ తన అనుమానం.

'ఆమె గర్భంలో పెరుగుతున్న పిండాన్ని సశాస్త్రీయంగా తొల గించాడు తాను. ఫీజు మాట దేవు డెరుగు. కనీసం మందు ఖర్చైనా ఇచ్చెయ్యకపోతే ఎలా! ఇచ్చేయ మని అడిగాడు తాను. తనకు బాగా తెలుసు- ఆమె ఇచ్చుకోలేదని. అయినా అడిగాడు తాను. ఎందు కంటే, ఫీజుకు బదులు ఆమె తన శరీరాన్ని తనకర్పిస్తుందేమోననే స్వార్థంతో.

'ఏమీ ఇచ్చుకోలేనందామె. ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక విధంగా ఋణం తీర్చుకుంటానంది.

ఆమె బాగా కోలుకున్నాక, ఋణం ఏ విధంగా తీర్చుకోవచ్చో చెప్పాడు తాను.

'ఒప్పుకోలేదామె. అయితే రహస్యం తన నోటి మీదుగానే బహిర్గతమవుతుందని బెదిరించాడు తాను.

'పాపం బెదిరిపోయింది. బెదిరి లొంగిపోయింది తనకు. అట్లాంటి పతితకు త్వరలో పెళ్ళవబోతుంది.'

అందుకనే అంతలాగ ఆశ్చర్య పోయేడు డాక్టర్‌మూర్తి.

'ఆమెను పెళ్ళాడబోతున్న వాడె వడోగాని, పాపం బాగా మోస పోతున్నాడు. అతగాడికి సరోజ ఎటువంటిదో తెలియజేస్తేనో? ఎందుకు? తనకేం ప్రయోజనం? సరోజకు పేరుకొక మొగుడంటూ వుంటే తనకు మరీ మంచిది. శరీ రాన్నే ఫీజుగా సమర్పించే పెర్మ నెంట్ పేషంట్‌గా వుంటుంది సరోజ తనకు.'

ఈ తీరులో డాక్టర్ మూర్తి ఆలోచనా తరంగాలలో తేలియాడు తూన్న సమయంలో- "డాక్టర్ గారూ!" అని పిలిచేడొక ముసలి పేషంట్.

మూర్తి ఆ ముసలివాడి ముఖం లోనికి నిశితంగా చూస్తూ-'ఇట్లాంటి ముసలివాళ్ళ కింకా బ్రతకాలనే వాంఛ తీవ్రంగా వుండబట్టే, తన వంటి డాక్టర్లకు ప్రాక్టీసు బాగా ఉంటోంద'ని మనసులో అనుకొని, "ఏం? ఎలాగుంది?" అనడిగాడు.

"బాగానే వుంది సార్! ఇవాళ కొంచెం విస్కీ..."

"తాగొచ్చు! మోతాదు మించ కుండా తాగండి!" అని అనుజ్ఞ నిచ్చేడు డాక్టర్ మూర్తి.

ఆ ముసలాడు మహదానంద

భరితుడై, "థాంక్యూ సర్! వద్దంటారేమోనని భయపడ్డాను." అంటూ పాతిక రూపాయిల్ని టేబుల్ పై పెట్టి, "మళ్ళీ జబ్బు తిరగేసినప్పుడు కారు పంపిస్తా! వెంటనే రావాలి మీరు!" అని చెప్పి వెళ్ళిపోయేడు.

'ఎంత మంచి పేషంటో!' అని మనసులో అనుకున్నాడు డాక్టర్ మూర్తి.

'ఇట్లా ధారాళంగా డబ్బిచ్చే పేషంట్లూ, ఫీజుకు బదులుగా శరీరాన్ని అప్పజెప్పే సరోజలాంటి పేషంట్లూ, దండిగావుంటే తనకెంతో హాయిగా ఉంటుంద'నుకున్నాడు డాక్టర్ మూర్తి.

'ఇంతకీ సరోజను పెళ్ళాడబోతున్న వాడిది ఈ వూరేనా? మరేదయినా వూరైతే తనకు ఇబ్బందే! వివరాలేవీ చెప్పకుండానే కొంప మునిగిపోయినట్లు వెంటనే వెళ్ళిపోయింది సరోజ.

'సరే! ఇన్విటేషన్ కార్డ్ ఇవ్వడానికి మళ్ళీ వస్తానందిగా! అప్పుడు వివరాలన్నీ అడగొచ్చ'నుకున్నాడు మూర్తి.

* * *

ఇన్విటేషన్ కార్డ్‌ను డాక్టర్ మూర్తి చేతికి అందిస్తూ, "నా పెళ్ళికి మీరు తప్పకుండా రావాలి!" అంది సరోజ.

"పెళ్ళెక్కడ?" అనడిగాడు డాక్టర్ మూర్తి.

"వివరాలన్నీ ఇన్విటేషన్ కార్డులో వున్నాయి."

ఇన్విటేషన్ కార్డు చదివి నిర్ఘాంతబోయేడు మూర్తి.

"ఎలక్ట్రిక్ షాక్ పొందినవాడిలాగ అలా ఐపోయేరేం? సైకాలజీ లెక్చరర్ 'సుధాకర్' నన్ను పెళ్ళి చేసుకుంటున్నందుకా? ఏ గుడ్డివాడో, మూగవాడో, అంగవైకల్యం గలవాడో, పరమ దరిద్రుడో తప్పితే మరెవ్వడూ నన్ను చేసుకోడనుకున్నారు కదూ? కాని సుధాకర్ ఈ లోకంలో చాలా మందికంటే మంచివాడు, గొప్పవాడూను!" అనంది సరోజ.

"బహుశా అతనికి నీ కేరక్టర్ గురించితెలియక పోయుండవచ్చు!"

"అందుకని మీరతనికి నా కేరక్టర్ గురించి వివరంగా తగిన ఋజువులు, సాక్ష్యాలతో చెప్పాలనుకుంటున్నారు కదూ? ఇటుపైని ఈ విధంగా నన్ను బెదిరించి లొంగదీసుకోవచ్చని మీరు ఆశిస్తున్నారు కదూ? మిమ్మల్ని అనవసరంగా ఎందుకు శ్రమపెట్టడమని నేనే నా వివరాలన్నీ అతనికి చెప్పాను. మీరెలాంటివారో కూడా చెప్పాను. నేను చెప్పేనో లేదో

అనే అనుమానం మీకున్నట్లయితే, మీరు స్వయంగా అతన్ని కలిసి, నా కేరక్టర్ గురించి అతనికి బాగా బుర్రకెక్కేలా చెప్పండి. పెళ్ళికి తప్పకుండా రండి!" అని చెప్పి వెళ్ళిపోబోయి ఆగి—

"అన్నట్లు చెప్పడం మరచేను. 'సుధాకర్' ఎవరో తెల్సా? నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి, వివాహం చేసుకోవడానికి అంగీకరించి, దురదృష్టవశాత్తూ ఓ బస్సు ప్రమాదంలో మరణించిన 'మధు' కి స్నేహితుడు. మధుతోపాటు నేను కూడా నిగ్రహశక్తిని కోల్పోయి నందువలన గర్భవతి నయినాను. ఇహ పెళ్ళి చేసుకుందామనుకుంటూండగానే ప్రమాదవశాత్తు మధు చనిపోయేడు. నాలోని మనోదౌర్బల్యం నన్ను పిరికిదాన్ని చేసింది. మీరెంతో సహృదయతతో సహాయం చేస్తారనే విశ్వాసంతో మీదగ్గర కొచ్చేను. నా మనోదౌర్బల్యాన్ని, పిరికితనాన్ని మీ స్వార్థానికి వాడుకున్నారు. ఎవరైతే పిరికితనంతో ఇష్టంలేని పరిస్థితులతో రాజీపడతారో వారే ఈ లోకంలో ప్రతీ విషయంలోనూ వంచింపబడుతూంటారనే సత్యాన్ని తెలుసుకున్నాను" అనంది.

డాక్టర్ మూర్తిలో సహనం నశించింది. మరి వినలేకపోయేడు:

"సరోజా! నీ నుండి నేను కొత్తగా తెల్సుకోవలసిన విషయాలేవీ లేవు. నువ్వు వెంటనే యిక్కడి నుంచి వెళ్ళిపో!" అని కసిరినట్లు ఆజ్ఞాపించాడు.

గబగబా వెళ్ళిపోయింది సరోజ.

• • •

'తన భార్య పూర్వాశ్రమంలో సరోజలాంటి దేనేమో!' అనే అనుమాన పిశాచం, డాక్టర్ మూర్తి మస్తిష్కంలో గజ్జెకట్టి నృత్యం చేయ సాగింది!

అయిష్టంగానే సుధాకర్ దగ్గర కెళ్ళాడు డాక్టర్ మూర్తి.

"సరోజ కోసం వచ్చారా?" అడిగాడు సుధాకర్.

"కాదు. మీకోసమే వచ్చాను!"

"ఎందుకు?"

"చికిత్సకోసం!"

"చికిత్సకోసమా?"

"అవును. మనోరోగానికి చికిత్సకోసం! నా భార్య పెళ్ళికాక ముందు సచ్ఛీలవతి కాదేమోనని నాకనుమానం కల్గింది! అందువల్ల నా మనస్సంతా విషపూరితమయి పోయింది. ఏం చెయ్యాడమో నాకు అవగతం కాలేదు!"

"ఓ పని చెయ్యండి: ఇంత వరకూ గడిచిన జీవితంలో

మీరెంతమంది యువతుల్ని ఏ ఏ రకాలుగా వంచించి వాళ్ళ జీవితాలతో ఆడుకున్నారో మీ భార్యకు వివరంగా చెప్పండి! ఆవిడలో వచ్చే రియాక్షన్‌ను బట్టి మీ జీవితాన్ని సరిదిద్దుకోండి!" అని సలహా యిచ్చాడు సుధాకర్.

డాక్టర్ మూర్తి తన కేరక్టర్ గురించి అన్ని వివరాలు తన భార్యకు చెప్పేడో లేదో-ఒకవేళ చెప్పివున్నట్లయితే ఆమె ఎలా 'రియాక్ట్' అయిందో-ఆ వివరాలు ఏవీ తెల్సుకొనేటందుకు సుధాకర్‌కి గాని, సరోజకు గాని మరి అవకాశం లేకపోయింది! ఎంచేతంటే- డాక్టర్ మూర్తి ఆ వూళ్ళో ప్రాక్టీసు మానేసి, భార్యాపిల్లలతో సహా ఏ వూరో వెళ్ళిపోయేడు. ఏ వూరు వెళ్ళిపోయిందీ తెలియదు.

"ఏమిటీ చికిత్స?" అనడిగింది సరోజ భర్తను.

"ఇట్లాంటి రోగాలకు యిదే తగిన చికిత్స!" అని సమాధానమిచ్చాడు సుధాకర్ నవ్వుతూ.

"ఇంతకీ డాక్టర్ మూర్తి కుటుంబంతో సహా యీ వూరు వదిలిపెట్టి ఎందుకు వెళ్ళిపోయాడంటారు?" అనడిగింది సరోజ.

"కాస్త ఓపిగ్గా ఆలోచిస్తే నీకే అవగతమవుతుంది" అని అన్నాడు సుధాకర్. అంతకుమించి యింకేమీ చెప్పలేదు. *


విజయ
మాస పత్రికలో
సంచలనం సృష్టించిన
శ్రీప్రసాద్
చారిత్రాత్మక నవలలు

ఆర్యచాణక్య ..10.00
రోషనార ..8.00
అఫ్జల్ ..10.00
యుగంధర్ ..12.00

ఇప్పటికే
వేయి కాపీలు పైగా
అమ్ముడై
మీ అభిమానాన్ని
చూరగొన్న పుస్తకాలు.

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్, విజయవాడ 2